## కథ

-సి.వి.నరసింహదాసు

జీవితమనే పుస్తకంలో తెరుచుకున్న ప్రతి పేజీ గడిచే ఒక్కోరోజు. ప్రతి అక్షరంలో కొత్తదనం. ప్రతి క్షణంలో వినూతనత్వం.

తెల్లవారిందంటే చాలు..నాలో ఆనందం పరవళ్ళు తొక్కేది. ఇంత వెలుతురు తెచ్చే సూరీడు కేవలం నాకోసమే ప్రత్యేకంగా వచ్చినట్టనిపించేది.

సైకిలు డొక్కుదయినా, ఆరు మైళ్ళ దూరాన్ని ఇరవై నిమిషాల్లో అధిగమించే పూల పల్లకిలా అనిపించేది. ఎనిమిది గంటలకల్లా స్కూలు మొదలైనప్పటి నుండి గుండెల్లో ఒక్కటే సవ్వడి.

పీరియడ్‌కి పీరియడ్‌కి మధ్యలో మిత్రులతో కబుర్లు, అల్లరి కచేరీలు, ఆకతాయి పనులు, నవ్వులు, కేరింతలు, వీటన్నిటినీ మించి వీచే పరిమళాలు మరో దిశ నుండి వచ్చేవి. అటు వైపు మూడు రకాల పూల తీగలుండేవి. ఒక తీగ పేరు మీసాల ఈశ్వరమ్మ, రెండో తీగ పల్లెవారి పద్మావతి. ఇక మూడోది సింగవరపు సత్య శోభిత. ముగ్గురిలో ఏ ఒక్కరు స్కూలుకి రాకపోయినా, ఆ రోజంతా అంతులేని వెలితి మనసుని పీడించేది.

ముగ్గురూ మూడు వేర్వేరు కుటుంబ పరిస్థితుల నుండి వచ్చారు. వేషధారణలో, భాషోచ్ఛారణలో తేడాలు సుస్పష్టంగా తెలిసేవి. అయినా, ఈ తేడాలు వేటికవే విభిన్నంగా అనిపించేవి.

వారి కులాల గురించిన చర్చలు మా స్నేహితుల మధ్య విరివిగా సాగేవి. ఐతే...ఆ తారతమ్యాల కారణంగా ఒకరి నుండి మరొకరిని వేరుగా ఎందుకు చూడాలో ఎలా చూడాలో తెలిసేది కాదు.


అబ్బాయిల దృష్టిలో అమ్మాయిలెప్పుడూ స్పెషలే...టీనేజ్‌లోకి అప్పుడే అడుగిడిన నాకు మినహాయింపేమీ లేదు.

క్లాసులో మొదటి రాంకు, మొదటి సీటు నాదే...మాకు వేరుగా అభిముఖంగా వేసిన బెంచిమీద అమ్మాయిలు కూర్చునేవారు. తల ఎలా తిప్పినా అమ్మాయిలు కనిపించేవారు. ఆ ముగ్గురినీ అలా గంటల తరబడి చూడవలసి వచ్చినా అసలు విసుగనిపించేది కాదు. అసలు చూడలేకపోతేనే విసుగంతా. పాఠం కూడా చెవికెక్కలేని చిరాకు వేసేది.

వాళ్ళు మాట్లాడుతుంటే ఏదో సాధించేసిన ఫీలింగ్...నన్ను స్పెషల్‌గా ట్రీట్ చేస్తున్నారని భావించి అంతే స్పెషల్‌గా, స్టైలిష్‌గా మాట్లాడే వాణ్ణి...ఒకరిద్దరు మిత్రులు నాకేసి అసూయగా చూసేవారు(?) కూడా. అదీ ఒకింత నాలో గర్వంగానే వుండేది.

సినిమాల్లో శృంగార దృశ్యాలకి, నాయికానాయకుల సన్నిహిత్యానికి పూర్తిగా అర్థం తెలియకపోయినా ఓ మగో ఓ ఆడ కలిసి వున్న జంట దృశ్యంలో ఓ ప్రత్యేకత ఏదో వుందనిపించేది. అందుకేనేమో నా ఊహల్లోకి ముగ్గురూ ఒకేసారి కాకుండా ఒక్కొక్కరుగా చేరి, కలవరపెట్టడం జరుగుతోంది.

మల్లెపందిరి కింద ఒకరికొకరు కళ్ళలోకి చూసుకుంటూ పాట పాడుకునే అక్కినేని, సావిత్రిల్లా నాతో ఈశ్వరమ్మ ఊసులాడుతున్నట్టనిపించేది. ఊరు చివర శోభన్‌బాబుని ఇరవై అడుగుల దూరం నుండి పరుగు పరుగున వచ్చి



# రెక్కలు తొడిగి రెప రెపలాడి...

కౌగలించుకునే మంజులలా పద్మావతి నా ఊహల్లో సరాగాలాడేది. స్విట్జర్లాండ్ వీధుల్లో స్పీడు స్టెప్పులేస్తూ డాన్స్ చేస్తున్న ఎన్టీఆర్ శ్రీదేవిల్లా, శోభిత కూడా నాలో చిందు వేయించేది. ఇలాంటివే వేల వేల ఊహలు నాలో నూతనోత్తేజం నింపేవి.

ఊహ వరకు సరే! ఆ తర్వాతేమిటి? ఏమో..నాకూ తెలీదు..అది తెలిసే అవకాశం వచ్చేలోపలే అనుకోని సంఘటన జరిగిపోయింది.

ఆరోజు క్లాసు టెస్ట్ జరుగుతోంది. ఎందుకో తలెత్తి చూసిన నాకు, పద్మావతి పేపర్ని మక్కీకి మక్కీ చూసి కాపీ కొడ్తున్న శోభిత కన్పించింది. వారి పట్ల నాలో అప్పటివరకు ఉన్న ఆరాధన, అభిమానం ఏమైపోయాయో తెలీదు. నా ఫస్ట్ రాంక్‌కి విఘాతం కలుగుతుందనే భావన నిలువనీయలేదు. టీచర్‌కి విషయం కంప్లయింట్ చేయడం, ఆయన వెంటనే స్పందించి అమ్మాయిలిద్దర్ని దగ్గర పేపరు లాగేసుకుని బైటికి పంపేయడం జరిగిపోయాయి. వెళ్తూ వెళ్తూ శోభిత చూసిన చూపు నన్నింకా వెంటాడుతూనే వుంది.

ఆరోజు నుండి ముగ్గురూ నాతో మాటలాపేశారు. వారి దృష్టిలో నేను విలన్‌నైపోయాననే ఊహ భయంకరంగా మారిపోయింది.

నిజానికి కొంచెం తెలివి ఉపయోగించి వుంటే వారు ఎంత కాపీ కొట్టినా, నాకొచ్చే మార్కులకి దరిదాపుల్లోకి కూడా రాగలిగేంత తెలివితేటలు వారికి లేవని గుర్తుకొచ్చేది. అలా ఆలోచిస్తే కాస్త బాధ కలిగేది. మరోవైపు వారు చేసిన తప్పు గుర్తొచ్చి, నేను తప్పు చేయలేదని వాళ్ళు నాతో మాట్లాడకపోతే వచ్చే నష్టమేమీ లేదని సర్దిచెప్పుకునేవాడిని.

## త్రిష ఆనందం

**ఇటీవల కాలంలో తెలుగులో త్రిషకి సరైన హిట్టు లేదు. అయితే ఆమె నటించిన తాజా చిత్రం 'ఆడవారి మాటలకు అర్థాలు వేరులేలే'లో మంచి మార్కులు కొట్టేసింది. ఇందులో త్రిష నటనకు అన్ని వర్గాల నుంచీ ప్రశంసలు లభిస్తున్నాయి. దీంతో ఆమె ఆనందంతో ఉబ్బితబ్బిబ్బవుతోందిట. అలాగే అతి త్వరలోనే తమిళంలో ఆమె నటించిన సినిమా 'భీమ' కూడా రిలీజ్ కాబోతోంది. ఆ సినిమా కూడా విజయం సాధిస్తే త్రిష కెరీర్ కొత్త మలుపు తిరగవచ్చు. శుభం!**



ఒకరివైపునుండి 'సారీ' ముందుగా చెప్పుకునే లోపలే స్కూలు ఫైనల్ అయిపోయింది.

అయితే...ఈమధ్య కాలంలో నా ఆలోచనలు 'నీరజ'కి దగ్గరయ్యాయి. ఆమె మా వీధిలోనే ఆరిళ్ళవతల సంగీతం మాస్టారమ్మాయి. నాకన్నా ఏడాదే చిన్నది. స్కూలు చదువులోని నా హీరోయిజం మా వీధిలో నాకు ఓ గుర్తింపు తెచ్చిపెట్టింది. అలాగే నలుగురైదురు ఆప్తులైన మిత్రుల్ని పోగేసుకుని ప్రతి శివరాత్రి, వినాయక చవితి, విజయదశమి లాంటి పండుగలకి నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు పెద్దల్ని కూడా ఆకట్టుకునేవి. ఈ కార్యక్రమాల్లో ఆడపిల్లల వైపు లీడర్ 'నీరజ'.

అభిరుచులు కలిసాయి. కొన్నాళ్ళకి ఒకరినొకరు ఇంప్రెస్ చేసుకోవడానికే కొత్త కొత్త ఐడియాలతో ముందుకొచ్చేవాళ్ళం.

ఆమెతో మాట్లాడుతుంటే సమయం తెలిసేదే కాదు. చీకటి పడి ఎవరిళ్ళకి వారు విడిపోతున్నప్పుడు, జన్మ జన్మల బంధమేదో తెగిపోతున్నంత బాధ కలిగేది.

మొదటిసారి ఆమెను అనుకుని శివాలయం మెట్ల మీద కూర్చున్న రోజు, నాకు క్లాస్ ఫస్ట్ వచ్చిందని తెలిసి, మొదటిసారి నా చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుని అభినందనలు తెలిపిన రోజు, జ్వరంతో బాధపడుతుంటే నీళ్ళు నిండిన కళ్ళతో నా తల నిమిరి ధైర్యం చెప్పిన రోజు...అలా రోజు రోజుకి మా సాన్నిహిత్యం పెరుగుతుంటే...ఆ చనువునేమని పిలవాలి..మనసులో మెదిలే 'ఆ' మాటని బయటపెట్టే మొదటి చొరవ ఎవరు తీసుకుంటారు?

ఆరోజు మాత్రం రానేలేదు. నా స్కూలు ఫైనలు తర్వాత మేము ఊరు మారిపోవడంతో పాత జ్ఞాపకాలు శిథిలమై కొత్త అంకాలకి తెరలేచింది.

ఐశ్వర్య...

అందాల సామ్రాజ్యానికి యువరాణి. ఆమె చేయందుకుని మహారాజుగా మారే అదృష్టం కోసం పరితపించే పలు జనాల్లో నేనూ ఒక్కడినైపోయాను.

ఆమె..మా ఇంగ్లీషు ట్యూషన్ మాస్టారమ్మాయి.

పదహారేళ్ళ అప్సరస...

చూస్తేనే చాలు మనసు రెక్కలు కట్టుకుని ఎక్కడెక్కడో విహరిస్తుంది. వయసు గట్లు తెంచుకుని ప్రవహిస్తుంది.

మా నూనూగు మీసాల నూత్న యవ్వనానికి ఆమె అందాలని స్వంతం చేసుకోవాలనే తహతహ దుస్తుల వెనుక నుండి దర్శనమిచ్చే మేని వంపుల్ని చూస్తుంటే నరనరాల్లో ఏదో తపన..మరుగుతున్న రక్తంలో ఆందోళన.

ఇంటర్లో తనది వేరే గ్రూప్. వేరే కాలేజీ కావడంతో మాట్లాడే అవకాశం చాలా తక్కువసార్లు వచ్చింది. అదీ మా 'ట్యూషన్' కారణంగా.


ఆమె ఫీలింగ్స్ తెలిసేవి కావుగాని, నాకు కొన్ని రాత్రులు నిద్ర కరువు చేసేది.

నా ఆలోచనల్లో క్రమంగా మార్పు చోటు చేసుకుంది. కనిపించే ప్రతి అమ్మాయినీ నిశితంగా పరిశీలించడం ఎక్కువైంది.

మ్యూజిక్ కాలేజీ అమ్మాయి 'గౌరి' కంటపడేవరకూ, ఐశ్వర్య తలుపులు..ఆపై దృష్టి 'గౌరి' మీదకి మళ్ళింది.


వావ్..

లంగా ఓణికి నా మనసు లొంగిపోయింది. ఆమె ముఖంలో ఎంత ప్రశాంతత. చూసేకొద్దీ ఎంత హాయి..'జీవిత భాగస్వామి' మాట మొదటిసారి మెరిసింది 'ఆమె'తోనే...




## పోకిరి పార్ట్-2

**మహేష్‌బాబు 'పోకిరి' ఎంతటి సంచలనం సృష్టించిందో అందరికీ తెలుసు. 75 ఏళ్ల తెలుగు సినిమా చరిత్రలో ఓ సరికొత్త అధ్యాయాన్ని ప్రారంభించిందీ పోకిరి. కనీవినీ ఎరగని వసూళ్లతో దుమ్ము దులిపేసిన ఈ సినిమాకి సీక్వెల్‌ని తీయాలనే ఆలోచనతో దర్శకుడు పూరి జగన్నాథ్ వున్నట్టు టాలీవుడ్ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఇందులో కూడా మహేష్ బాబే హీరోగా నటిస్తాడు. హీరోయిన్, ఇతర నటీనటుల వివరాలు త్వరలోనే తెలియవచ్చు. మరి పార్ట్ 2 'పోకిరి' పార్ట్ వన్ కంటే మిన్నగా సంచలనం సృష్టిస్తుందా లేదా ఎదురుచూడాల్సిందే!**



వేట..వేట..ఆమె కంట పడాలని, ఆకర్షించాలని, స్వంతం చేసుకోవాలని...ఆతృత.

కొంత జీవితం ఖర్చయిపోయింది. ఆమె చిన్న తమ్ముడితో పరిచయం పెరిగింది. ఆమె తల్లిదండ్రుల దృష్టిలోనూ పడ్డాను. అయితే అది అంతవరకే..ఆమె కోసం ఓ బావ ఎదురు చూస్తున్నాడని తెల్సిన రోజు మనస్సు చివుక్కుమన్న మాట నిజమే.

కానీ...జీవితం అక్కడే ఆగిపోలేదు. డిగ్రీలో క్లాస్‌మేట్ 'శైలజ'. మిత్రుడి చెల్లెలు 'భావన', జూనియర్ 'శ్రీలక్ష్మి'....యిలా....ఎవరెవరో.... ఎందరెందరో...

అభిమానం, ఆకర్షణ, వాంఛ, ప్రేమ, స్నేహం, ఆలంబన, ఆత్మీయత, ఆదరణ...పేరేదైనా మగవాడికి స్వాంతన తెచ్చేది మగువే..ఆ స్వాంతనని కుత్సితానికి వాడుకుని పురుషుడు చరిత్ర హీనుడిగా మారిపోతున్నాడు.

అదృష్టవశాత్తూ శారీరక వాంఛలు నన్ను డామినేట్ చేయలేకపోయాయి ఏ దశలోనూ...

కట్న కానుకలు, ఆస్తి అంతస్థుల సంబంధాలు ఎన్ని వచ్చినా ఎక్కడో ఏదో వెలితి..

వయసు పెరిగే పరిణామ దశలో మనసు మరింత పరిపక్వత చెందాలి..బాహ్య సౌందర్యాలని మోహపడే దృక్కులు వీడి అంతఃచక్షువులు తెరచుకోవాలి.

పెళ్ళయిన ఈ పాతికేళ్ళలో నేనే నాడూ బాధపడింది లేదు.

నా భార్య 'జ్యోతిర్మయి'.

అగ్ని ప్రమాదంలో చూపుని కోల్పోయినా, తను నడుపుతున్న 'అనాథ శరణాలయం'లో పిల్లలు తనలా 'అనాథలు'గా మిగిలిపోకూడదని, వారి కోసమైనా తన బ్రతుకు పోరాటాన్ని కొనసాగించాలనే ఆమె ఆత్మస్థైర్యాన్ని గురించి తెలుసుకుని, ఆమె చేస్తున్న యజ్ఞంలో పాలు పంచుకోవాలని, భాగస్వామినయ్యాను మనస్ఫూర్తిగా.

ఆ...ఆలంబనకి నేడు పాతికేళ్ళు.

ఆనందం- గడిచిపోయిన తిరిగిరాని కాలంలోనే కాదు..మగవాడికి వర్తమానంలోనూ వుంది..మగువ రూపంలో.

☆